# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో 13 వేల 430 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కర్నూలు నుండి ప్రారంభించనున్నారు.
- జీఎస్టీ తగ్గింపులపై గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.
- అభివృద్ధి వికేంద్రీకరణకు ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మారుస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.
- పీపీపీ విధానంలో ఉద్యోగాల కల్పన పెరుగుతుందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన నిమిత్తం రేపు ఉదయం కర్నూలు విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడ నుంచి శ్రీశైలం వెళ్ళి శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి వార్లను దర్శించుకుంటారు. ఆ తరువాత ఆలయానికి సమీపంలోనే ఉన్న శ్రీ శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. ఇక మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు కర్నూలు శివార్లలోని నన్నూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన “సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్“ సభలో పాల్గొంటారు. సభా వేదికపై నుంచి రాష్ట్రానికి సంబంధించిన 13 వేల 430 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం ప్రధానమంత్రి సభనుద్దేశించి ప్రసంగిస్తారు.

======================

ప్రభుత్వ శాఖలు అందించే పౌర సేవలు, ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల సేవలు, ప్రజా సంతృప్త స్థాయిపై ముఖ్యమంత్రి సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు కలిగిన ప్రయోజనాలు తదితర అంశాలపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసరాలు, ఇతర ఉత్పత్తులపై పన్నులు తగ్గిన అంశంపై గిరిజన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. దీపావళి తర్వాత కూడా ప్రజల్లోకి పన్నుల తగ్గింపు అంశాన్ని తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ సమీక్షకు రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, ఐటీ, ఆర్టీజీఎస్ శాఖల అధికారులు హాజరయ్యారు.

======================

పీపీపీ విధానంలో ఉద్యోగాల కల్పన పెరుగుతుందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ హామీని సాకారం చేస్తామన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో టాటా గ్రూప్‌కు చెందిన హిటాచీ షోరూంను మంత్రి ఈరోజు ప్రారంభించారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఇటువంటి ప్రైవేట్ సంస్థలు దోహదపడతాయని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ నినాదమని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ప్రతి జిల్లాలోనూ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అనంతపురం, కర్నూలు జిల్లాల్లో సిమెంటు ఫ్యాక్టరీలు, పంప్డ్ స్టోరేజ్ పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఈ రంగానికి సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని ఆయా జిల్లాల్లో కల్పిస్తున్నామన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్ లో అనేక పెట్టుబడులను కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందని చెప్పారు. ఇక రాజధాని అమరావతి క్వాంటం టెక్నాలజీలో దేశంలోనే ప్రత్యేక గుర్తింపును పొందిందని పేర్కొన్నారు. ఇలా అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణకు ఆంధ్రప్రదేశ్ ను చిరునామాగా మారుస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

విరామం

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

======================

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ ఎడ్విన్ తెలిపారు. విజయవాడ డిఆర్ఎం కార్యాలయంలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... రైల్వే స్టేషన్  బయట పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంటుందన్నారు. రైల్వే భోగిలలో ప్రయాణీకులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని, అలా వేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో స్వచ్ఛ్ రైల్ కార్యక్రమం ద్వారా ప్రయాణీలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

విజయనగరం జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి కోసం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్నఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణాలను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఈరోజు పరిశీలించారు. ముందుగా కొత్తవలస మండలం బలిఘట్టంలో నిర్మాణంలో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కును కలెక్టర్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ పార్కుకు సుమారు 57.09 ఎకరాలను కేటాయించారని, దీనిలో తొలిదశ కింద 22 ఎకరాల్లో 82 ప్లాట్లను అభివృద్ధి చేస్తున్నామని ఏపీఐఐసీ అధికారులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం బొండపల్లి మండలం కొండకిండాంలో నిర్మితమవుతున్న ఎంఎస్ఎంఈ పార్కును కలెక్టర్ పరిశీలించారు. ఈ పార్కుకు కూడా మొత్తం 57 ఎకరాలు కేటాయించినట్లు తహసీల్దార్ రాజేశ్వర్రావు తెలిపారు.

======================

ప్రతీ ఒక్కరూ తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, పరిశుభ్రతను పాటించడం వంటి అలవాట్లను ఆచరిస్తూ ఆరోగ్యంగా ఉండాలని అనంతపురం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈ.బి. దేవి అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రోజు అనంతపురం సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోవడం అనేది రోగాల నివారణకు ముఖ్యమైన చర్య అని, చిన్నప్పటి నుంచే పిల్లల్లో పరిశుభ్రత అలవాట్లను పెంపొందించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు.

======================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో తూర్పు, ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రేపటి వర్ష సూచనలను వాతావరణ శాఖాధికారి ఎం. వెంకట్రావ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 82,029 పాయింట్ల లాభంతో ప్రారంభమై... చివరకు 576 పాయింట్ల లాభంతో 82,605 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 178 పాయింట్లు పెరిగి 25,323 వద్ద ముగిసింది. రూపాయి మారకం విలువ డాలరుతో పోలిస్తే 88 రూపాయల 10 పైసలుగా ఉంది.

======================

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడపల్లిలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని తెలుసుకోవడానికి జర్మనీకి చెందిన ప్రత్యేక బృందం ఈరోజు పర్యటించింది. వారి వెంట రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కలెక్టర్ శ్యాం ప్రసాద్ వెళ్ళి అక్కడ రైతులు పంటలు ఏ విధంగా పండిస్తున్నారు, ఎటువంటి ఎరువులు వాడుతున్నారు మొదలగు విషయాలను ఆ బృందానికి తెలియజేశారు.

======================
======================